సాక్షి
ములుగు

బుధవారం | 7 | జూన్ | 2023



**కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు** - 8లో▸

ప్రజలకు మెరుగైన సౌకర్యం కోసం కష్టపడి పని చేస్తున్న కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని మంత్రి దయాకర్‌రావు అన్నారు.



**అభివృద్ధికి అడుగులు పడేనా?**

రామప్ప దేవాలయాన్ని మంత్రి కేటీఆర్ సందర్శించడానికి వస్తున్న నేపథ్యంలో ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తారా అనే చర్చ జరుగుతోంది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$42^0/29^0$

**వాతావరణం**

జిల్లాలో ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉండి వడ గాలులు వీస్తాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### రామప్పలో ఏర్పాట్ల పరిశీలన



**వెంకటాపురం(ఎం):** మండల పరిధిలోని రామప్ప దేవాలయాన్ని నేడు రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సందర్శించనుండడంతో మంగళవారం మంత్రి సత్యవతిరాథోడ్ రామప్పను ఎస్పీ గాష్ ఆలంతో కలిసి సందర్శించారు. రామప్ప ఆలయాన్ని కేటీఆర్ సందర్శించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. అనంతరం రామప్ప సరస్సు కట్టపై జరిగే సాగునీటి దినోత్సవంలో కేటీఆర్ పాల్గొననుండడంతో సరస్సు కట్టను పరిశీలించారు. కేటీఆర్ పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులకు మంత్రి సత్యవతిరాథోడ్ సూచించారు. అదే విధంగా రామప్ప ఆలయ పరిసర ప్రాంతాలను, సరస్సు కట్టను బాంబ్ స్క్వాడ్ బృందంచే పోలీసులు తనిఖీలు నిర్వహించారు.

### ఉత్తమ మీ సేవ అవార్డు అందజేత



**వెంకటాపురం(కె):** మీ సేవ ద్వారా ఉత్తమ సేవలు అందించిన వెంకటాపురం మీసేవ నిర్వాహకుడు చిడెం రవికుమార్‌కు కలెక్టర్ కృష్ణ ఆదిత్య ఉత్తమ అవార్డును అందజేశారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, పరిశ్రమల విభాగంలో ఉత్తమ సేవలు అందించిన వారికి జిల్లా కేంద్రంలో మంగళవారం అవార్డులు అందించి సన్మానించారు.

### పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



**వెంకటాపురం(కె):** తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఖమ్మం మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ అన్నారు. మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. తెలంగాణ అవిర్భావ దశాబ్ది వేడుకల్లో ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పాయం రమణ, మండల అధ్యక్షుడు గంపా రాంబాబు, కార్యదర్శి పిల్లారి శెట్టి మురళి, తదితరులు పాల్గొన్నారు.

### నిప్పంటుకొని ఇల్లు దగ్ధం



**కన్నాయిగూడెం:** ప్రమాదవశాత్తు నిప్పంటుకొని ఓ వృద్ధుడి ఇల్లు అర్ధరాత్రి దగ్ధమైంది. ఈ ఘటన మండల పరిధిలోని చింతగూడెంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. చింతగూడెంలో వృద్ధుడు కావిరి ఇస్తారి ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. సోమవారం తన ఇంటి చుట్టూ ఉన్న చెత్తకు నిప్పు పెట్టి కాలపెట్టాడు. అనంతరం చల్లార్చాడు. రాత్రి రోజు మాదిరిగానే ఆరుబయట నిద్రిస్తున్నాడు. అర్ధరాత్రి వీచిన గాలులకు రగులుకున్న నిప్పు ఇంటిపై పడి అంటుకుంది. నిద్రలో ఉన్న ఇస్తారి లేచి చూసే సరికి ఇల్లు పూర్తిగా అంటుకుని బీకరంగా మంటలు వ్యాపించాయ. కేకలు వేయగా చుట్టు పక్కల వారు వచ్చే సరిగా ఇల్లు పూర్తిగా కాలిపోయింది. తాను సంపాధించుకున్న నగదుతో పాటు వంట సామగ్రి కాలిబూడిదయ్యాయని వృద్ధుడు కన్నీటి పర్యంతమయ్యాడు. దాతలు ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

### బెస్ట్ అవైలబుల్ స్కీం డ్రా వాయిదా

**ఏటూరునాగారం:** నేడు(బుధవారం) ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించాల్సిన బెస్ట్ అవైలబుల్ స్కీం కింద 3, 5వ తరగతుల్లో ప్రవేశానికి చేపట్టిన డ్రాను వాయిదా వేస్తున్నట్లు డిప్యూటీ డైరెక్టర్ పోచం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని గిరిజన విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు ఈ డ్రాకు రావొద్దని సూచించారు. డ్రా ఎప్పుడు నిర్వహిస్తామనేది మళ్లీ తెలియజేస్తామని పేర్కొన్నారు.

# రామన్న జరచూడన్న..

- గోదావరి నీళ్లు సాగుకు అందేలా చూడాలి
- బిల్ట్ ఫ్యాక్టరీ పునఃప్రారంభమెప్పుడు
- మల్లంపల్లి, లక్ష్మీదేవిపేట, రాజుపేటలను మండలాలుగా ప్రకటించాలి
- గిరిజన యూనివర్సిటీ తరగతులు, రామప్ప అభివృద్ధిపై దృష్టి సారించాలి





ములుగు పట్టణ వ్యూ

**ములుగు:** వెనుకబడిన ములుగు జిల్లాలో పలు సమస్యలు పేరుకుపోయాయి.. తలాపున గోదావరి ఉన్నా సాగునీరు అందడం లేదు.. జిల్లా కేంద్రంలో డ్రెయినేజీ సమస్య..కమలాపురం బిల్ట్ ఫ్యాక్టరీ మూసివేత తదితర సమస్యలు పరిష్కరించాలని నేడు జిల్లా పర్యటనకు వస్తున్న మంత్రి కేటీఆర్‌ను ప్రజలు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో తమ సమస్యలను రామన్న జరచూసి పరిష్కరించన్నా అంటూ వేడుకుంటున్నారు. ములుగు నియోజకవర్గానికి తలాపున గోదావరి నది ప్రవహిస్తున్నా సాగునీరు అందడం లేదు. దీంతో రైతులు భూగర్భ జలాలు, చెరువులపై ఆధారపడి పంటలను సాగు చేస్తున్నారు. ములుగు నుంచి నర్సంపేట, పాఖాల, జనగామ, వంటి ఇతర ప్రాంతాలకు గోదావరి జలాలు తరలిపోతున్నా స్థానికులు ఏమి చేయలేక పోతున్నారు. ఈ విషయంలో మంత్రులకు, అధికారులకు వినతిపత్రాలు అందించినా ఫలితం లేకుండా పోయింది. దేవాదుల ద్వారా భీం ఘన్‌పూర్ నుంచి రామప్పకు ప్రత్యేక కెనాల్ ద్వారా వాటర్ పంపింగ్ చేస్తున్నప్పటికీ కేవలం చెరువు పరిధిలో 10 వేల ఎకరాల ఆయకట్టుకు మాత్రమే సాగుకు ఉపయోగకరంగా ఉంది. లక్నవరం రిజర్వాయర్‌గా మారుస్తామన్న పనులు మధ్యలో నిలిచి పోయాయి. గ్రావిటీ కెనాల్ కోసం భూ సేకరణ చేపట్టిన క్రమంలో రైతులకు రెవెన్యూ అధికారులకు మధ్య రేటు కుదరకపోవడంతో పనులు ఆగిపోయాయి. లక్నవరం రిజర్వాయర్‌గా మారితే మరో 5 వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. దీంతో పాటు జంపన్నవాగుకు ఏడాది పాటు నీటి సరఫరా చేసే లభ్యత ఉంటుంది.

**అస్తవ్యస్తంగా డ్రెయినేజీలు**

జిల్లా కేంద్రంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ఆయా కాలనీల్లో నిర్మించిన డ్రెయినేజీ కాల్వలకు లింక్‌లు లేకపోవడంతో మురుగునీరు నిలిచి పోతుంది. దీంతో వర్షాకాలం, చలికాలంలో దోమలు వృద్ధి చెంది స్థానికులు జ్వరాల భారిన పడుతున్నారు. పంచాయతీ తరఫున ఉన్న నిధులతో ప్రధాన డ్రెయినేజీ వ్యవస్థను అభివృద్ధి చేస్తే సమస్య పునరావృతం కాదు. ఈ విషయంలో ప్రతీసారి జీపీ అధికారులకు, స్థానికులకు గొడవలు అవుతున్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరుతున్నారు.



కమలాపురం బిల్ట్ ఫ్యాక్టరీ(ఫైల్)



డ్రెయినేజీలో పేరుకుపోయిన మురుగు నీరు

**బిల్ట్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు..**

మంగపేట మండలం కమలాపురం బిల్ట్ ఫ్యాక్టరీ 5 ఏప్రిల్ 2014న మూతపడింది. దీంతో ప్రత్యక్షంగా 10వేల మంది, పరోక్షంగా 15 వేల మంది ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం బిల్ట్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు మూడేళ్ల కాలంలో రూ. 210 కోట్లను రాయితీగా ప్రకటించింది. అయినప్పటికీ పరిశ్రమ యాజమాన్యం ముందుకు రాకపోవడంతో ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఇప్పటి వరకు 42 మందికి పైగా కార్మికులు పలు కారణాలతో మృతి చెందారు. ఇందులో కొంతమంది ఆర్థిక పరమైన ఇబ్బందులతో ఆత్మహత్యలకు పాల్పడడం బాధాకరం. రాష్ట్ర ప్రభుత్వం బిల్ట్ యాజమాన్యంతో చర్చలు జరిపి పునః ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా ప్రస్తుతం సమస్యతో బిల్ట్ యాజమాన్యం తీసుకున్న అప్పులపై బ్యాంకులు దివాల కోర్టును ఆశ్రయించాయి. ఇటీవల కోర్టు తీర్పు తమకు అనుకూలంగా రాకపోవడంతో కార్మికులు మరోసారి కోర్టుకు అప్పీల్ చేశారు. అదే విధంగా మండలంలో గోదావరి తీరం వెంబడి కరకట్ట నిర్మాణానికి భూ సర్వే ఇటీవల చేపట్టారు. అయితే ఇప్పటి వరకు అధికారికంగా పనులు సాగడం లేదు. త్వరితగతిన పూర్తి చేసి పనులు ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

**నూతన మండలాల ఏర్పాటుకు ఎదురుచూపు**

ములుగు జిల్లా ఏర్పాటు కాక ముందు నుంచి మల్లంపల్లి, మంగపేట మండల పరిధిలోని రాజుపేట, వెంకటాపురం(ఎం) మండలంలోని లక్ష్మీదేవిపేట రెవెన్యూ గ్రామాలను మండలాలుగా ఏర్పాటు చేయాలని స్థానికులు పోరాడుతున్నారు. ముఖ్యంగా ములుగు మండల పరిధిలోని మల్లంపల్లి విషయంలో ఆందోళనలు ఎదురయ్యాయి. మంత్రులు, జెడ్పీ చైర్మన్ పర్యటన సమయంలో స్థానికులు అడ్డుకునే ప్రయత్నాలు చేశారు. ఆ క్రమంలో మండల ఏర్పాటుకు సహకరిస్తామన్న నాయకులు నేడు మాట్లాడక పోవడంపై విమర్శలు వస్తున్నాయి. అదే విధంగా మంగపేట మండలంలో రాజుపేట, వెంకటాపురం(ఎం) మండలంలో లక్ష్మీదేవిపేట అతిపెద్ద గ్రామాలుగా, విస్తీర్ణంలోనూ పెద్దగా ఉన్నాయి. మంత్రి కేటీఆర్ ఈ విషయంపై పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.

**యూనివర్సిటీ తరగతులు ఎప్పటి నుంచి..**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో గిరిజన యూనివర్శిటీ ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక జీఓను పొందుపరిచారు. ఆంధ్రప్రదేశ్‌లో స్థలం కేటాయించడం పూర్తయి తరగతులు ప్రారంభమయ్యాయి. తెలంగాణలోని ములుగు మండలంలో గట్టమ్మ సమీపంలో స్థల సేకరణ చేసి కేంద్రానికి అప్పగించినా ఇప్పటి వరకు తరగతులు ప్రారంభం కాలేదు. అడిగినప్పుడల్లా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోపణలు చేసుకుంటున్నాయి తప్పా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. అదే విధంగా యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప, ఉప ఆలయాలను అభివృద్ధి చేయాలని భక్తులు కోరుతున్నారు. రోజురోజుకూ దేవాలయానికి పర్యాటకుల సంఖ్య పెరుగుతుండడంతో జంగాలపల్లి నుంచి రామప్ప వరకు రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టాలని, దీని కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.



# నేడు ములుగుకు కేటీఆర్



కేటీఆర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్, కలెక్టర్ తదితరులు



గులాబీ జెండాలతో ముస్తాబైన ములుగు జిల్లా కేంద్రం

- కలెక్టరేట్ నిర్మాణానికి శంకుస్థాపన, పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం
- అనంతరం రామప్పలో జరిగే సాగునీటి దినోత్సవానికి హాజరు
- ఆయనవెంట హోం మంత్రి మహమూద్ అలీ
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సత్యవతి రాథోడ్

**ములుగు:** రాష్ట్ర ఐటీ, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) నేడు(బుధవారం) ములుగు జిల్లాకు రానున్నారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని హెలిపాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో సమీకృత కలెక్టరేట్ నిర్మాణ స్థలానికి చేరుకొని శంకుస్థాపన చేస్తారు. అనంతరం పలు అభివృద్ధి, సంక్షేమ పనులను ప్రారంభిస్తారు. అక్కడినుంచి వెంకటాపురం (ఎం) మండలం రామప్ప చేరుకొని ఇరిగేషన్ డేలో పాల్గొంటారు. తిరుగు ప్రయాణంలో ములుగు జిల్లా కేంద్రంలోని సాధన హైస్కూల్ పక్కన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, ప్రజలనుద్దేశించి మాట్లాడుతారు. కేటీఆర్ వెంట హోం మంత్రి మహమూద్ అలీ రానున్నారు. ఇందులో భాగంగా మంగళవారం రాష్ట్ర గిరిజన, స్త్రీ–శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ కృష్ణా ఆదిత్య, ఎస్పీ గాష్ ఆలంలు.. సంబంధిత శాఖ అధికారులకు సలహాలు, సూచనలు చేశారు. మంత్రి కేటీఆర్ సభకు భారీ జన సమీకరణ చేసేందుకు బీఆర్‌ఎస్ పార్టీ తరపున ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ ఆధ్వర్యంలో మండలాల వారీగా సమీక్షలు నిర్వహించారు. జిల్లాలోని తొమ్మిది మండలాలు ఉండగా ఒక్కో మండలంనుంచి 2 వేల మంది కంటే ఎక్కువగా జన సమీకరణ చేసేందుకు కార్యాచరణ చేపట్టారు.

**కేటీఆర్ టూర్ షెడ్యూల్ ఇలా..**

**ఉదయం 10:15 – 10:55 గంటల వరకు :** ములుగులో హెలికాప్టర్ ల్యాండింగ్ అవుతుంది. తరువాత బండ్రుపల్లిలో రూ.65 కోట్లతో నిర్మిస్తున్న సమీకృత కలెక్టరేట్ భవన పనులకు శంకుస్థాపనతోపాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు.

**11:00 గంటలకు:** ఐదు మోడల్ పోలీస్ స్టేషన్ భవనాలకు శంకుస్థాపన చేస్తారు.

**11:30 గంటలకు:** రోడ్డు మార్గంలో రామప్పకు చేరుకుంటారు.

**11:45గంటలకు:** రామప్ప ఆలయ సందర్శన, ఇరిగేషన్ డే సందర్భంగా గోదావరి జలాలకు పూజలు చేస్తారు.

**12.00–1.30 వరకు :** ములుగుకు చేరుకుంటారు. మహిళలకు వడ్డీలేని రుణాలు, లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ చేసి ప్రసంగిస్తారు.

**2:00గంటలకు:** హెలికాప్టర్‌లో పరకాల సమీపంలోని గుడెప్పాడ్ ఎక్స్‌రోడ్డుకు చేరుకుంటారు. ఎమ్మెల్యే ధర్మారెడ్డి కూతురు రిసెప్షన్‌కు హాజరవుతారు.

**2:30గంటలకు :** హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు పయనమవుతారు.

## అభివృద్ధిలో రాష్ట్రం ఆదర్శం

**వాజేడు:** దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తుందని మాజీ ఎంపీ సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ అన్నారు. మండల కేంద్రానికి మంగళవారం వచ్చిన వారు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పదేళ్ల క్రితం ఉన్న తెలంగాణ కంటే ఇప్పుడు అన్ని రంగాల్లో అభివృద్ధి కనిపిస్తోందన్నారు. సీఎం కేసీఆర్ కృషితోనే 24 గంటల విద్యుత్ ఇవ్వడంతో పాటు సాగు, తాగు నీరు అందుతుందన్నారు. హైదరాబాద్‌లో కొత్త కంపెనీల ద్వారా 1.80 లక్షల మందికి కొత్తగా ఉద్యోగాలు వచ్చే అవకాశం ఏర్పడిందన్నారు. హైదరాబాద్ దేశానికి తలమానికంగా మారిందని కితాబు నిచ్చారు. తెలంగాణలో పంటలు పుష్కలంగా పండుతున్నాయని వివరించారు. పలు శాఖల్లో ఉన్న ఉద్యోగులను క్రమబద్ధీకరించి వారి కుటుంబాల్లో వెలుగులను సీఎం కేసీఆర్ నింపారని ప్రశంసించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి పక్క రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని వివరించారు. జిల్లా కేంద్రంలో నేడు నిర్వహించ తలపెట్టిన మంత్రి కేటీఆర్ బహిరంగ సభకు ప్రజలు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో భద్రాచలం నియోజక వర్గ నాయకులు బుచ్చయ్య, వెంకటాపురం(కె) ఎంపీపీ పాయం రమణ, వాజేడు, వెంకటాపురం(కె) మండల పార్టీల అధ్యక్షులు రామ కృష్ణారెడ్డి, రాంబాబు, పార్టీ కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# అత్యధిక మెజార్టీ ఖాయం

- కేటీఆర్ రాకను విజయవంతం చేయాలి
- మంత్రి సత్యవతి రాథోడ్



మాట్లాడుతున్న మంత్రి సత్యవతిరాథోడ్

**ములుగు:** త్వరలో జరగబోయే శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో ములుగు నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీతో బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపొందడం ఖాయమని రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. నేడు(బుధవారం) రాష్ట్ర ఐటీ, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ ములుగు జిల్లాకు వస్తున్న సందర్భంగా జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడారు. కేటీఆర్ పర్యటనను బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ములుగులో బీఆర్‌ఎస్ పార్టీ బలంగా ఉందన్నారు. రాబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో సత్తా చాటుతామన్నారు. జిల్లా కేంద్రంలో సుమారు రూ. 200 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. దేశమంతా కేటీఆర్ వంటి నాయకుడిని కోరుకుంటుందని వివరించారు. మంత్రి కేటీఆర్ చొరవతో రాష్ట్రానికి రూ. 34లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని వివరించారు. సీఎం కేసీఆర్‌కు తగ్గ కొడుకుగా మంత్రి కేటీఆర్ పేరుగాంచారని వ్యాఖ్యానించారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలు, కేటీఆర్ రాకను ప్రజలు, కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు ఇంటి పండుగలా భావించాలన్నారు. గడిచిన నాలుగేళ్లలో పార్టీ తరపున ఎమ్మెల్యే లేకపోయినా సంక్షేమ, అభివృద్ధి పథకాలకు విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. మంత్రి కేటీఆర్‌కు స్థానికంగా ఉన్న సమస్యలను వివరించి పరిష్కస్తామని తెలిపారు. పార్టీలోని అన్ని వర్గాల నాయకులు ఏకతాటిపై నిలబడి సత్తా చాలాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్, జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ నాగజ్యోతి, రెడ్కో చైర్మన్ సతీశ్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, ఎంపీపీ గండ్రకోట శ్రీదేవిసుధీర్‌యాదవ్, జెడ్పీటీసీ సకినాల భవాని, మండల పార్టీ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ కుమార్, లింగాల రమణారెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు పోరిక విజయరాంనాయక్, బీఆర్‌ఎస్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కోగిల మహేష్, పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ సేవల్లో తెలంగాణ భేష్



మాట్లాడుతున్న కలెక్టర్ కృష్ణ ఆదిత్య


**ములుగు:** డిజిటల్ సేవల్లో తెలంగాణ భేష్ అని కలెక్టర్ కృష్ణ ఆదిత్య అన్నారు. ఈ మేరకు ఐటీ, పారిశ్రామిక దినోత్సవం సందర్భంగా మీ సేవ, ఆధార్, సీఎస్‌ఈ రంగాల తరపున ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కలెక్టర్ మంగళవారం పరిశీలించి మాట్లాడారు. పీఎంఈజీపీ ద్వారా 50 మందికి జీవనోపాధి కల్పిస్తున్నామన్నారు. పారిశ్రామిక రంగంలో ములుగును ముందంజలో ఉంచుతామని వివరించారు. టీఎస్ ఐపాస్ ద్వారా తెలంగాణలో పారిశ్రామిక రంగంలో విప్లవాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. మారుమూల గ్రామాల్లో మీసేవను అందుబాటులోకి తీసుకువచ్చి సేవలు అందిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు రూ.30 వేల కోట్ల ట్రాంజక్షన్ జరిగిందని వివరించారు. మీ సేవ ద్వారా టీ వ్యాలెట్, టీ యాప్ ఫోలిక్, వంటి యాప్‌లను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

**ఫిష్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించాలి**

రేపటి నుంచి 10వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్‌లో నిర్వహించనున్న ఫిష్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలని కలెక్టర్ కృష్ణ ఆదిత్య అన్నారు. ఈ మేరకు మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాల్ పోస్టర్‌ను మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లాలోని ఆయా ఊర చెరువుల్లో పండుగను సంప్రదాయ పద్ధతిలో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి, పెసా కో ఆర్డినేటర్ కొమురం ప్రభాకర్, ఆయా చెరువుల కమిటీ అధ్యక్షులు సాదు రఘు, వెంకన్న పాల్గొన్నారు.

# సాగునీటి ప్రాజెక్టుల సంరంభం...

- ఉమ్మడి వరంగల్‌లో సాగునీటి ప్రాజెక్టులతో జలకళ
- తొమ్మిదేళ్లలో పరుగులు తీసిన ప్రాజెక్టులు
- దేశానికి ఆదర్శంగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకం..
- దేవాదుల, ఎస్సారెస్పీ–1, 2లతో చెరువులకు జలకళ...
- 13.59 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు...
- నేడు సాగునీటి దినోత్సవం..



కాళేశ్వరం ప్రాజెక్టు



దేవాదుల ప్రాజెక్టు

**సాక్షిప్రతినిధి, వరంగల్:** కోటి ఎకరాల మాగాణి లక్ష్యంగా సాగిన జలయజ్ఞంలో ఉమ్మడి వరంగల్ ప్రాజెక్టులకు మహర్దశ వచ్చింది. 2004–2008లలో ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టినా.. 2009 తర్వాత వాటికి మోక్షం కలగలేదు. జేసీఆర్ దేవాదుల, ఎస్సారెస్పీ – 2, కంతనపల్లి, తుపాకులగూడెం తదితర ప్రాజెక్టులు ఈ జాబితాలో ఉన్నవే. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత రీ డిజైనింగ్ ద్వారా తెలంగాణ వ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టుల పెద్దపీట వేసింది. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్‌లో గోదావరిపై కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి పూర్తి చేయడంతోపాటు దేవాదుల, ఎస్సారెస్పీ పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి దశకు చేరాయి. భారీ, మధ్యతరహా, చిన్న నీటి ప్రాజెక్టుల ద్వారా ఓరుగల్లుకు జలకళ వచ్చింది. తెలంగాణ ఆవిర్భావ, దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో బుధవారం సాగునీటి దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టులపై ప్రత్యేక కథనం.

**దేశానికే తలమానికం 'కాళేశ్వరం'..**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గోదావరి నదిపై నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం దేశానికే తలమానికం. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుగా చెబుతారు. దీని నిర్మాణాన్ని 2016లో చేపట్టి 2019 జూన్ 21న మొదటి దశను ప్రారంభించారు. ప్రాజెక్టు సామర్థ్యం 240 టీఎంసీలు. ఈ ప్రాజెక్టు నీరు ఎస్సారెస్పీ, దేవాదుల ప్రాజెక్టుల గుండా ఉమ్మడి వరంగల్‌లోని ఆయకట్టును తడుపుతోంది.

**తొమ్మిదేళ్లలో 13.59 లక్షల ఎకరాల ఆయకట్టు...**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు సీఈ కార్యాలయాల పరిధిలో వివిధ ప్రాజెక్టుల ద్వారా 13.59 లక్షల ఎకరాల ఆయకట్టుగా స్థిరీకరించారు. వరంగల్ సీఈ కార్యాలయంతో పరిధిలోకి జనగామ, పాలకుర్తి, పరకాల, స్టేషన్ ఘన్‌పూర్, వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో 7.43 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో కాకతీయ కెనాల్ కిలోమీటరు 209 (డీబీఎం 23) నుంచి కిలోమీటరు 284 (డీబీఎం 38, 40, 48లు మినహా) వరకు 84,000 ఎకరాలు ఉంది. దేవాదుల ఎత్తిపోతల కింద రామప్ప మీద వరకు 5.26 లక్షల ఎకరాలు, ఐడీసీ లిఫ్టుల కింద 3,000 ఎకరాలు, 2,177 చెరువుల కింద 1.33 లక్షల ఎకరాలు సాగులెక్కల్లో ఉంది. ములుగు సీఈ కార్యాలయం పరిధిలో భూపాలపల్లి, డోర్నకల్, మహబూబాబాద్, ములుగు, నర్సంపేట నియోజకవర్గాలకు చెందిన 6.16 లక్షల ఎకరాల ఆయకట్టుగా నిర్ధారించారు. సమ్మక్క బ్యారేజ్ (తుపాకులగూడెం) ద్వారా రామప్ప వరకు 32,000 ఎకరాలు, కాకతీయ కాల్వ డీబీఎం 38, 40, 48ల కింద 2.54 లక్షల ఎకరాలు, పాలెంవాగు, గుండ్లవాగు, మోడికుంటవాగు, తాలిపేరు, మల్లూరువాగు, పాఖాల, లక్నవరం, రామప్ప, బొగ్గులవాగు, భీమ్‌ఘన్‌పూర్‌ల కింద 96,000, నీటి వనరుల అభివృద్ధి సంస్థ (ఐడీసీ) లిఫ్టుల కింద 15,500 ఎకరాలు, 3,425 ట్యాంకుల కింద 2.18 లక్షల ఎకరాల స్థిరీకరించిన ఆయకట్టు ఉంది.

**కొండెక్కిన 'కోనాయమాకుల'....**

ప్రభుత్వం చొరవతో ప్రాజెక్టులు పరుగులు తీస్తుంటే.. వరంగల్ జిల్లా గీసుకొండ సమీపంలోని ఎస్సారెస్పీ ఆధారిత రిజర్వాయర్ 'కోనాయమాకుల'పనులు కంచికి చేరడం లేదు. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 2009 మే15న ఈ పథకం మంజూరు కాగా మే 14న కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ జరిగింది. పని విలువ రూ.49,35,32,830లు కాగా.. 2015 వరకూ 13.39 శాతమే పూర్తయ్యింది. ఆ తర్వాత ప్రభుత్వాలు మారడంతో పాటు కాంట్రాక్టర్ మారారు. సుమారు రూ.49.50 కోట్ల పని ప్రస్తుతం రూ.150 కోట్ల వరకు పెరిగినా ఇప్పటికీ పూర్తి కాలేదు. ఇలా మినీ కాళేశ్వరంతో పాటు ఎనిమిది పథకాలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని కూడా పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

**భారీగా పెరిగిన ఆయకట్టు**

సీఎం కేసీఆర్ చేపట్టిన జలయజ్ఞం ఫలితాలు రైతును రాజును చేశాయి. ఉమ్మడి వరంగల్‌లో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై దేశవ్యాప్తంగా చర్చ జరగ్గా.. 240 టీఎంసీల నీటిని ఎత్తిపోసే విధంగా 13 జిల్లాలకు మేలు జరగనుంది. దేవాదుల, ఎస్సారెస్పీ–2 తదితర పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి చేయడంతోపాటు పెద్ద మొత్తంలో ఆయకట్టు పెరగడానికి జిల్లా ప్రాజెక్టులు దోహదం చేస్తున్నాయి.

– కె.సుధాకర్ రెడ్డి, ఎస్ఈ, జలవనరులశాఖ

## రామప్పను సందర్శించిన స్పెయిన్ దేశస్తులు

**వెంకటాపురం(ఎం):** మండల పరిధిలోని రామప్ప దేవాలయాన్ని మంగళవారం స్పెయిన్ దేశానికి చెందిన డేవిడ్, మెరిటెల్‌లు ఇండియా టూరిజం గైడ్ కరుణానిధితో కలిసి సందర్శించారు. రామప్ప రామలింగేశ్వరస్వామిని వారు దర్శించుకోగా ఆలయ పూజారి హరీశ్ శర్మ వారికి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. టూరిజం గైడ్ కరుణానిధితో పాటు విజయ్‌కుమార్ ఆలయ విశిష్టత గురించి వారికి వివరించగా రామప్ప టెంపుల్ బ్యూటిఫుల్ అంటూ కొనియాడారు. అనంతరం సరస్సును సందర్శించి బోటింగ్ చేశారు.

# అభివృద్ధికి అడుగులు పడేనా?

- యునెస్కో గుర్తింపు పొందినా.. రామప్ప అభివృద్ధి నిల్
- ప్రతిపాదనలకే పరిమితమవుతున్న పనులు
- నేడు రామప్పలో మంత్రి కేటీఆర్ పర్యటన

వెంకటాపురం(ఎం): ప్రపంచ ప్రసిద్ధి చెందిన రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు వచ్చినా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దగా నిధులు కేటాయించలేదు. 2021 జూలైలో రామప్ప ఆలయానికి ప్రపంచ వారసత్వ హోదా లభించడంతో రాష్ట్ర మంత్రులు రామప్ప ఆలయాన్ని సందర్శించి రాష్ట్ర ప్రభుత్వం కృషితోనే యునెస్కో గుర్తింపు లభించిందని, రామప్ప అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, కేంద్ర ప్రభుత్వం కూడా రామప్ప అభివృద్ధికి రూ.200 కోట్ల నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కానీ, యునెస్కో గుర్తింపు వచ్చి రెండేళ్లు కావస్తున్నా రామప్ప అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

**సరస్సు కట్ట విస్తరించేనా..?**

రామప్ప ఆలయానికి పర్యాటకుల సంఖ్య పెరగడంతోపాటు, వందలాది సంఖ్యలో వాహనాలు రామప్ప ఆలయానికి వస్తున్నాయి. రామప్ప ఆలయాన్ని సందర్శించిన పర్యాటకులు సరస్సుకట్టకు చేరుకొని సరస్సులో బోటింగ్ చేస్తూ ఉల్లాసంగా గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో రామప్ప సరస్సు కట్టను విస్తరించి సరస్సుకట్టపై కాకతీయుల విగ్రహాలు నెలకొల్పాలని 2018లో ఇరిగేషన్ అధికారులు రూ.9కోట్లతో ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. రామప్ప సరస్సుకట్ట 6మీటర్ల వెడల్పుతో 610 మీటర్ల పొడవు ఉంది. దీనిని 6 మీటర్ల నుంచి 12.5 మీటర్ల వరకు విస్తరించి సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటుచేసేలా ప్రణాళికల్లో రూపొందించారు. కట్టకు ఇరువైపులా రెయిలింగ్ ఏర్పాటు చేసి, సరస్సుకట్టకు ఇరువైపులా టర్ఫింగ్‌తో పచ్చటిగడ్డి ఏర్పాటు చేయాలని భావించారు. పర్యాటకులు దిగేందుకు చెరువు వైపు 4చోట్ల, పొలాల వైపు 4 చోట్ల మెట్లను నిర్మించాలని ప్రతిపాదనల్లో పొందుపరిచారు. అంతేకాకుండా కాకతీయ వంశానికి చెందిన గణపతి దేవుడు, రేచర్ల రుద్రుడు, రాణి రుద్రమదేవి లాంటి కాకతీయుల ప్రతిమలను కట్టపై నెలకొల్పేందుకు ప్రతిపాదించారు. కానీ, ఇరిగేషన్ అధికారులు పంపిన ప్రతిపాదనలకు ఐదేళ్లు దాటినా ఇప్పటివరకు మోక్షం లభించకపోవడం గమనార్హం.

**ధ్యాన కేంద్రంపై ధ్యాసేది..!**

రామప్ప సరస్సు ఐలాండ్‌లో అంతర్జాతీయ ధ్యాన కేంద్రం ఏర్పాటు చేసేందుకు పర్యాటక శాఖ రూ.5కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. సరస్సులోని ఐలాండ్ 20 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా సరస్సులో 36 అడుగుల నీటిమట్టం చేరితే ఐదెకరాల్లో విస్తీర్ణంలో ద్వీపం (ఐలాండ్) ఉంటుంది. టూరిజం ప్రాంతంగా ఐలాండ్‌ను అభివృద్ధి చేసి 41 అడుగుల భారీ శివుని విగ్రహాన్ని ఏర్పా టు చేయాలని పర్యాటక శాఖ ప్రతిపాదనల్లో పేర్కొంది. హైదరాబాద్ హుస్సేన్‌సాగర్‌లోని బుద్ధ విగ్రహం తరహాలో శివుని విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని పర్యాటక శాఖ అధికారులు డిజైన్ రూపొందించారు. ఐలాండ్‌ను అభివృద్ధి చేసి ఆధ్యాత్మిక కేంద్రంగా మార్చితే దేశ, విదేశా ల నుంచి పర్యాటకుల సంఖ్య పెరుగుతుందని టూరిజం అధి కారులు భావించి ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి పంపిన ఫలితం లేకుండాపోయింది.



విస్తరించాల్సిన రామప్ప సరస్సు కట్ట ఇదే..



రామప్ప ఆలయం



రామప్ప ఐలాండ్‌లో నిర్మించాల్సిన శివుని విగ్రహం (నమూనా చిత్రం)

### కలగానే నాలుగు లేన్ల రహదారి

రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు వచ్చిన తర్వాత జంగాలపల్లి నుంచి రామప్ప ఆలయం వరకు, గణపురం క్రాస్(గాంధీనగర్) నుంచి రామప్ప వరకు గల రెండు లైన్ల రహదారిని నాలుగు లైన్ల రహదారిగా మార్చేందుకు 2021 డిసెంబర్‌లో ఆర్అండ్‌బీ అధికారులు రూ.30 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. యునెస్కో గుర్తింపుతో రోడ్డు విస్తరణ పనులు తొందరగానే జరుగుతాయని భావించినప్పటికీ పనులు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. మంత్రి కేటీఆర్ రామప్పపై ప్రత్యేక దృష్టి పెట్టి వివిధ శాఖలకు చెందిన అధికారులు పంపిన ప్రతిపాదనలకు మోక్షం లభించేలా నిధులు మంజూరు చేయాలని పర్యాటకులు, ప్రజలు కోరుతున్నారు.

### కేటీఆర్ కరుణించేనా..

నేడు జిల్లా పర్యటనకు వస్తున్న మంత్రి కేటీఆర్ రామప్ప ఆలయాన్ని ఉదయం 11:30 గంటలకు సందర్శించనున్నారు. మధ్యాహ్నం 12గంటలకు తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రామప్ప సరస్సు కట్టపై జరిగే సాగునీటి దినోత్సవం కార్యక్రమంలో పాల్గొననున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేటీఆర్ రామప్పకు తొలిసారిగా వస్తుండడంతో రామప్ప అభివృద్ధికి కేటీఆర్ ఏమైనా నిధులు మంజూరు చేస్తారా.. అనే చర్చ జరుగుతుతోంది.

## వడదెబ్బతో మేకల కాపరి మృతి



స్వామి (ఫైల్)

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని ఆజాం నగర్ గ్రామంలో మంగళవారం వడదెబ్బతో మేకల కాపరి మృతి చెందాడు. గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆజాంనగర్ గ్రామానికి చెందిన జడల స్వామి(50) రోజువారీగా మేకలను మేతకు తీసుకెళ్లాడు. అనంతరం సాయంత్రం ఇంటికి వచ్చి నలతగా ఉందని కుటుంబ సభ్యులకు చెప్పగా.. వారు స్థానిక ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లే క్రమంలో మృతి చెందినట్లు తెలిపారు. స్వామికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

## రెండు లారీలు ఢీ..

- ఓ డ్రైవర్ మృతి



ప్రమాదానికి గురైన లారీ

జనగామ రూరల్: ఆగిఉన్న ఇసుక లారీని మరో ఇసుక లారీ ఢీకొట్టిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం హైదరాబాద్- వరంగల్ రహదారిలోని పెంబర్తి వై జంక్షన్ వద్ద చోటు చేసుకుంది. మృతుడి కుమారుడు జుట్టు అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలోని ఇప్పర్తి గ్రామానికి చెందిన జుట్టు వెంకటయ్య (40) ఇసుక లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా భద్రాద్రి నుంచి హైదరాబాద్‌కు వస్తున్నాడు. ఈక్రమంలో జనగామ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న మరో ఇసుక లారీ పెంబర్తి హైవే గురుకుల పాఠశాల వద్ద ఎలాంటి ఇండికేటర్ లేకుండా నిలిపి ఉంచారు. అదే మార్గంలో ఇసుక లోడుతో వస్తున్న వెంకటయ్య ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో క్యాబిన్‌లో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఓనర్ ఎస్‌కే అన్వర్ ఫోన్ ద్వారా తమకు సమాచారం అందించాడని వెంకటయ్య కుమారుడు అనిల్ తెలిపారు. మృతదేహాన్ని జేసీబీ సాయంతో తీసి మార్చురీకి తరలించారు. అనిల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## వేధిస్తున్నాడని ఫిర్యాదు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న ఓ సూపర్ వైజర్ తనను వేధిస్తున్నాడని ఆరోపిస్తూ అదే ఆస్పత్రిలోని పేషెంట్ కేర్ విభాగంలో పనిచేసే ఓ మహిళ టౌన్ పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేసింది. సదరు సూపర్ వైజర్ ఆ మహిళను గతంలో చాలాసార్లు లైంగికంగా వేధించడంతోపాటు అవమానకరంగా మాట్లాడేవాడని, ఇందుకు తాను ఒప్పుకోకపోవటంతో తనపై ఇటీవల దొంగతనం నేరం మోపారని ఫిర్యాదులో పేర్కొంది. తాను ఎలాంటి నేరం చేయలేదని అకారణంగా తనపై నేరం మోపారని, ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని ఆమె కోరింది.



## కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు

- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



ఆత్మీయ సమ్మేళనంలో విల్లును ఎక్కు పెట్టిన మంత్రి దయాకర్‌రావు

పాలకుర్తి: ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ.. కష్టపడి పని చేసిన కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బమ్మెర గ్రామంతోపాటు పలుగు బోడు తండా, ఎర్రగుంట తండా, దుబ్బ తండా, పెద్ద తండా, రాఘవపురం గ్రామాల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ గుర్తింపుతోనే మంత్రి అయి.. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేసినట్లు చెప్పారు. వేదికపై మంత్రి దయాకర్‌రావుకు ఇచ్చిన విల్లును ఎక్కుపెట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మదార్, దార శారద శంకరయ్య, బాలు నాయక్, ఎర్రబెల్లి రాఘవరావు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలి



మాట్లాడుతున్న చైర్మన్ తిరుమల్‌రావు

హసన్‌పర్తి: విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు అన్నారు. భీమారంలోని ఎస్‌వీఎస్ విద్యాసంస్థల్లో మంగళవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. దశాబ్ది వేడుకల ను పురస్కరించుకుని తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవాల్లో భాగంగా వరంగల్ రీజియన్, టాస్క్ ఆధ్వర్యంలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించారు.కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు ప ట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. విద్యార్థులు ఎంటర్ ప్రెన్యూర్‌గా రాణించాలన్నారు.

**ప్రతివారం ప్లేస్‌మెంట్స్...**

ప్రతి వారం కళాశాలలో ప్లేస్‌మెంట్స్, ఆరు నెలలకో సారి మెగా జాబ్‌మేళా నిర్వహిస్తామని విద్యాసంస్థల చైర్మన్ తిరుమల్‌రావు తెలిపారు. జన్‌పాక్ట్, ఈఎంఆర్, హెచ్‌ఆర్‌హెచ్, ఐఐఎఫ్ఎల్, ముత్తూట్, శ్రీరాం, జనరల్ ఇన్సూరెన్స్, జియో కంపెనీలను ఆహ్వానించామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాల్లోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ జాబ్‌మేళాలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టాస్క్ రీజినల్ జనరల్ మేనేజర్ రామకృష్ణ, కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ రఘు, ట్రెనింగ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు సుశాంత్, గోపాల్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## గ్రానైట్ క్వారీలో ట్రాక్టర్ డ్రైవర్ దుర్మరణం

- మహాలక్ష్మి క్వారీలో ప్రమాదం

నెల్లికుదురు: ప్రమాదవశాత్తు కాంప్రెషర్ (బండలకు రంధ్రాలు వేసే యంత్రం) ట్రాక్టర్ బోల్తా కొట్టిన ఘటనలో డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన మానుకోట జిల్లా నెల్లికుదురు మండలంలోని చిన్ననాగారం మీఠ్యాతండా పరిధిలోని మహాలక్ష్మి గ్రానైట్ క్వారీలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం చిన్ననాగారం, మీఠ్యా తండా పరిధిలోని మహాలక్ష్మి గ్రానెట్ క్వారీలో మంగళవారం బండలకు రంధ్రాలు వేసేందుకు ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన పసునూరి శ్రీను (40) కాంప్రెషర్ ట్రాక్టర్‌ను నడుపుకుంటూ క్వారీలోపలికి ర్యాంపుమీదనుంచి వెళ్తున్నాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ శ్రీను తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్సనిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. శ్రీను తండ్రి పసునూరి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపారు.

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి



యశ్వంత్ (ఫైల్)

నెల్లికుదురు: మానుకోట జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలో మంగళవారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు, ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లికుదురు మండల కేంద్రానికి చెందిన తోట ముత్తయ్య కుమారుడు యశ్వంత్ (20)కుటుంబ సభ్యులతో కలసి వ్యవసాయ భూమిలోని వరి గడ్డిని ట్రాక్టర్‌లో లోడు చేస్తున్నాడు. ఈ క్రమంలో యశ్వంత్ అక్కడే పడిఉన్న ఇనుప గొర్రును ఇంటికి తీసుకెళ్లేందుకు ట్రాక్టర్‌లో వేసే క్రమంలో కిందికి వేలాడుతున్న 11కేవీ విద్యుత్ వైర్లకు ఇనుప గొర్రు ప్రమాదవశాత్తు తాకి విద్యుత్ షాక్ గురయ్యాడు. యశ్వంత్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గ మధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. అయితే 11కేవీ విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని రైతులు పలుమార్లు విద్యుత్ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని, యశ్వంత్ మృతికి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. యశ్వంత్ తండ్రి ముత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



## ఎన్ఐఆర్ఎఫ్‌లో ఎస్సార్‌కు 98వ ర్యాంక్



వరదారెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న వీసీ దీపక్‌గార్గ్

హసన్‌పర్తి: కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన ఎన్ఐఆర్ఎఫ్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్) ర్యాంకుల్లో హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అన్నాసాగరం శివారులోని ఎస్సార్ యూనివర్సిటీకి ఇంజినీరింగ్ విభాగంలో 98వ స్థానం దక్కిందని ఎస్సార్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి తెలిపారు. యూనివర్సిటీలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వరదారెడ్డి మాట్లాడారు. యూనివర్సిటీ విభాగంలో 101-150 ర్యాంక్ బ్యాండ్‌లో నిలిచిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఎస్సార్ ప్రథమ స్థానంలో నిలిచిందని వివరించారు. యూనివర్సిటీలో జరుగుతున్న అభివృద్ధి, పరిశోధనలు, పారిశ్రామిక భాగస్వామ్యం, జాతీయ, అంతర్జాతీయ ఒప్పందాలు, నాణ్యమైన, విద్య ర్యాంక్ రావడానికి కొలమానంగా చెప్పారు. యూనివర్సిటీ న్యాక్, ఎన్‌బీఏ అక్రిడేషన్స్ సాధించడం జరిగిందన్నారు. యూనివర్సిటీలో ఎన్నో రీసెర్చ్ సెంటర్స్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎస్సార్ ఎక్స్ ఇంక్యుబేషన్ సెంటర్ ద్వారా ఎన్నో స్టార్ట్-అప్స్‌కు అంకురార్పణ జరిగిందన్నారు. ఎస్సార్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ దీపక్‌గార్గ్ మాట్లాడుతూ.. నూతన సాంకేతికతలో ఎస్సార్ యూనివర్సిటీ ముందు వరుసలో ఉందన్నారు.

### కేయూ ఫార్మసీ కళాశాలకు 82వ ర్యాంకు

కేయూ క్యాంపస్: నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ నివేదికలో కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ర్యాంకు 82వ ర్యాంకు దక్కించుకుంది. ఈమేరకు విద్య, విదేశీ వ్యవహారాలశాఖ సహాయ మంత్రి డాక్టర్ రాజ్‌కుమార్ రంజన్ సింగ్ సోమవారం 100లోపు ర్యాంకులను విడుదల చేశారు. 2021లో 48వ ర్యాంకులో ఉన్న కేయూ ఫార్మసీ కళాశాల ప్రస్తుతం 82వ ర్యాంకుకు పడిపోవడం గమనార్హం. తెలంగాణలో ఈ ఏడాది కేయూ ఫార్మసీ కళాశాల 4వ స్థానంలో ఉంది. దీంతోపాటు, దేశంలో వివిధ యూనివర్సిటీల 100లోపు ర్యాంకులు కూడా ప్రకటించగా.. అందులో కాకతీయ యూనివర్సిటీ పేరు లేకపోవడంపై విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## కేసీఆర్‌కు కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఉత్తరాలు



ఉత్తరాలను చూపుతున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు

కేయూ క్యాంపస్: విశ్వవిద్యాలయాల్లోని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ జాక్ ఆధ్వర్యంలో మంగళవారం సీఎం కేసీఆర్‌కు ఉత్తరాలు పోస్టు చేశారు. యూనివర్సిటీలో పనిచేస్తున్న కుక్టా జాక్ చైర్మన్ డాక్టర్ కరుణాకర్‌రావు ఇతర బాధ్యులు, కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు క్యాంపస్‌లోని పోస్టాఫీస్ వద్ద ఉన్న పోస్టు డబ్బాలో ఉత్తరాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కరుణాకర్‌రావు మాట్లాడుతూ.. గత పాలకుల నిర్లక్ష్యం వలన కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల జీవితాలు ఛిద్రం అవుతున్నాయన్నారు. 20నుంచి 25 సంవత్సరాలుగా కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా అభద్రతాభావంతో జీవితం సాగిస్తున్నారన్నారు. ఇప్పటికైనా రెగ్యులరైజ్ చేసే ప్రక్రియ ప్రారంభించాలని ఆయనప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఎం గతంలో ఇచ్చిన హామీ మేరకు రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఉత్తరాల పోస్టు కార్యక్రమంలో కుక్టా జాక్ కన్వీనర్ డాక్టర్ సాధు రాజేష్, బాధ్యులు నిరంజన్, జితేందర్, వెంకటగోపినాథ్, సునీత, చంద్రశేఖర్, విద్యాసాగర్, యాకయ్య, బ్రహ్మం, రాజు, రమాదేవి, కనకయ్య పాల్గొన్నారు.

## వర్సిటీల్లో విద్యావ్యవస్థను పటిష్టం చేయాలి



సదస్సులో మాట్లాడుతున్న మాజీ వీసీ లింగమూర్తి

కేయూ క్యాంపస్ : తెలంగాణలోని యూనివర్సిటీల విద్యావ్యవస్థను పటిష్టపర్చాల్సిన అవసరం ఉందని, అలాగే యూనివర్సిటీలోని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని కేయూ మాజీ వీసీఆచార్య ఎస్.లింగమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్రంలోని యూనివర్సిటీల కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ కేయూలో కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో యూనివర్సిటీలోని దూరవిద్యాకేంద్రం సెమినార్ హాల్‌లో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.అన్ని అర్హతలున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు కూడా గైడ్‌షిప్ ఇచ్చి యూనివర్సిటీలను పరిశోధనల వైపు మళ్లించి న్యాక్‌లో మంచి గ్రేడ్ సాధించుకోవాలని, విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, ఉన్నత విద్యామండలి ఆ దిశగా అడుగులు వేయాలన్నారు. సమావేశంలో ఆల్ తెలంగాణా యూనివర్సిటీస్ కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్, అసోసియేషన్ కేయూ బాధ్యులు ఆర్‌డీ ప్రసాద్, టీ.నాగయ్య, చందూలాల్, రవి, మధుశ్రీ, కృష్ణయ్య, అల్, రాధిక, కవిత, భిక్షపతి, మల్లేష్, విజయ్, రాజేశ్వరి, అరవింద, గోపి ,అనీఫా, శ్రీనివాస్, కల్పన, ఉషా, మధుకర్‌రావు, దయాకర్, దామోదర్, శ్రీధర్‌రావు పాల్గొన్నారు.